జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
ఆదివారం | 20 | సెప్టెంబర్ | 2026 ♦ పేజీలు : 8

# ఖగోళ విజ్ఞానంపై విద్యార్థులకు 3డీ అనుభూతి

- సౌర కుటుంబం, గ్రహాలు నక్షత్రాలపై అవగాహన
- తెలంగాణ గ్రామర్ స్కూల్ లో ఆకట్టుకున్న ప్లానిటోరియం ప్రదర్శన



**కల్లూరు, సెప్టెంబర్ 19: ప్రజా జ్యోతి** విద్యార్థుల్లో ఖగోళ విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు శాస్త్రీయ దృక్పధాన్ని అలవర్చే ఉద్దేశంతో కల్లూరు లోని తెలంగాణ గ్రామర్ స్కూల్ లో 3డీ ప్లానిటోరియం ప్రదర్శన నిర్వహించారు. 3డీ సాంకేతికత ద్వారా సౌర కుటుంబం, గ్రహాలు, నక్షత్రాలు అంతరిక్ష విశేషాలను విద్యార్థులు ఆసక్తిగా

మిగతా 2 లో...



# ధంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జనంకు ఏర్పాట్లు

- వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు
- వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి
- దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్, సిపి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.శనివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమీషనర్ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వినాయక నిమజ్జనం పురస్కరించుకొని కావాలసిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు

మిగతా 2 లో...

# చింతకాని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్




- సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**చింతకాని సెప్టెంబర్ 19ప్రజాజ్యోతి :** చింతకాని పోలీస్ స్టేషన్‌ను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్‌లో ఉన్న కేసులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. నేరాలు, నేరస్తులకు సంబంధించిన వివరాలను పోలీస్ కంప్యూటర్ వ్యవస్థలో ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. దర్యాప్తులో ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగిస్తూ, ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో భద్రపరచాలని ఆదేశించారు. జాతీయ నిఘా వ్యవస్థ, తెలంగాణ నేర పరిశోధన వ్యవస్థ వంటి సాంకేతిక వేదికలను దర్యాప్తులో

మిగతా 2 లో...

# కోదాడ మెగా జాబ్‌మేళాలో సత్తా చాటిన యస్.బి.ఐ.టి. విద్యార్థులు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కోదాడలో నిర్వహించిన మెగా జాబ్‌మేళ 2026లో భాగంగా తమ కళాశాలకు చెందిన విద్యార్థులు 73 ఉద్యోగాలను సాధించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ఉద్యోగ మేళలో 340 పైచిలుకు కంపెనీలు పాల్గొనగా ఖమ్మం జిల్లా నుండి తమ విద్యార్థులు వివిధ హోదాలలో ఉద్యోగాలు సాధించి జిల్లా ప్రతిష్టను పెంచారని కృష్ణ అభిప్రాయపడ్డారు. గూగుల్, విప్రో, ఫాక్స్‌ఖాన్, ఐసిఐసిఐ బ్యాంక్, కోటక్ మహేంద్రబ్యాంక్‌లతో పాటు



ఐటి, ఫార్మా, కన్స్ట్రక్షన్ వంటి వివిధ రంగాలకు చెందిన వందలాది కంపెనీలు ఉద్యోగ మేళాలో పాల్గొనగా తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం కేవలం తమ కళాశాలకే కాకుండా ఖమ్మం జిల్లాకు గర్వకారణంగా నిలిచారని కళాశాల సెక్రటరీ అండ్

మిగతా 2 లో...

# గణేష్ నిమజ్జనం పాయింట్ కు చేరుకునే మార్గాలు పాటించవలసిన ట్రాఫిక్ సూచనలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** 1రూరల్ మండలం నుంచి,రాపర్తి నగర్,బీసీ కాలనీ, కూరగాయల మార్కెట్, ఆర్‌ఆర్ స్కూల్ ఏరియా,కొత్త బస్టాండ్ ఏరియా,సాయిబాబా ఆర్చ్,ఆర్టిఏ ఆఫీస్ ఏరియా,బ్యాంక్ కాలనీ,వికలాంగుల కాలనీ,బల్లేపల్లి,ఖానాపురం టేకులపల్లి,న్యూ విజన్ కాలేజ్ పైపు నుండి వచ్చే గణేష్ విగ్రహాలు బైపాస్ ద్వారా ఎన్టీఆర్ సర్కిల్ కి చేరుకొని అక్కడి నుండి ఇల్లందు ఎక్స్ రోడ్, గవర్నమెంట్ హాస్పిటల్ జడ్పీ సెంటర్,చెరువు బజార్ బోనకల్ ఎక్స్ రోడ్, చర్చి కాంపౌండ్, ముస్తాఫ్ నగర్ సంబానిన గర్, రాఘవ మెడికల్స్, శ్రీరామ్ హిల్స్,దంసలాపురం చెరువుకి




వెళ్లేదారి గుండా నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి.పంపింగ్ వెల్ రోడ్,గాంధీనగర్, మోతీనగర్,పివిఆర్ రోడ్,గాంధీచౌక్ సారధినగర్, బొక్కలగడ్డ నుండి వచ్చే వాహనాలు నయాబజార్ నుండి జూబ్లీ క్లబ్ మయూరి సెంటర్, మామిళ్లగూడెం, బురాన్ పురం, బస్ డిపో ఏరియా, కమాన్ బజార్, కస్బా బజార్

మిగతా 2 లో...

## ఖగోళ విజ్ఞానంపై విద్యార్థులకు 3డీ అనుభూతి

(మొదటి పేజీ తరువాయి...)

వీక్షించారు. పాఠ్యపుస్తకాల ద్వారా నేర్చుకున్న ఖగోళ విజ్ఞానాన్ని 3డీ ప్రదర్శన ద్వారా ప్రత్యక్ష అనుభూతితో తెలుసుకోవడంతో విద్యార్థుల్లో ఆసక్తి, ఉత్సుకత పెరిగాయి. అంతరిక్షం, గ్రహాలు నక్షత్రాలపై శాస్త్రీయ అవగాహనను సులభంగా అర్థం చేసుకునే అవకాశం కల్పించిన ఈ ప్రదర్శన విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వినూత్నమైన అనుభవాత్మక విద్యను అందించడమే మా పాఠశాల లక్ష్యం. ఇలాంటి శాస్త్రీయ కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. వీటి ద్వారా వారిలో శాస్త్రీయ దృక్పథం పరిశోధన ఆసక్తి మరింత పెంపొందుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం పాయింట్ కు చేరుకునే మార్గాలు పాటించవలసిన ట్రాఫిక్ సూచనలు

(మొదటి పేజీ తరువాయి...)

నుండి వచ్చే వాహనాలు కిన్నెరసెంటర్, జడ్పీ సెంటర్,చెరువు బజార్ , చర్చి కాంపౌండ్ మీదుగా నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి.శ్రీ శ్రీ, సర్కిల్, శ్రీ నగర్ కాలనీ, రోటరీ నగర్, ఇందిరానగర్, పాత మమతా మెడికల్ కాలేజీ,మమత ఎక్స్ రోడ్,కవి రాజు నగర్,పాత కలెక్టరేట్ బ్యాక్ గల విగ్రహాలు గట్టయ్య సెంటర్, బ్యాంక్ కాలని,వీడియోస్ కాలనీ నుండి వచ్చే వాహనాలు ఇల్లందు ఎక్స్ రోడ్డు నుండి జడ్పీ కి చేరుకొని చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి.వెంకటగిరి ఎక్స్ రోడ్, శ్రీనివాస నగర్, గ్రేయిన్ మార్కెట్ ఏరియా, ప్రకాష్ నగర్,గుట్టల బజార్, జహీర్ పుర తండా అయ్యప్ప స్వామి టెంపుల్ ఏరియా విగ్రహాలు మొత్తం మెయిన్ రోడ్డు ద్వారా చర్చి కాంపౌండ్ కి చేరుకొని అక్కడి నుండి నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి.గొల్లగూడెం మధురానగర్ రాఘవయ్య నగర్ మమతా కాలేజ్, హార్వెస్ట్ స్కూల్ ఏరియా, అల్లిపురం, కొత్తగూడెం, అల్లిపురం ఎక్స్ రోడ్డు నుండి వచ్చే విగ్రహాలు టాటా మోటార్స్ ద్వారా చెరువు బజార్, చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి.బోనకల్ ఎక్స్ రోడ్,చర్చి కాంపౌండ్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, మిషన్ హాస్పిటల్ ఏరియా, ముస్తఫా నగర్,సంబాని నగర్,పరికముక్కల కాలనీ,శ్రీరామ్ నగర్, శ్రీరామ్ హిల్స్ నుండి వచ్చే విగ్రహాలు మెయిన్ రోడ్డు ఎక్కి నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి.

### తిరుగు ప్రయాణం

నిమజ్జనం అనంతరం ప్రజలు మరియు వాహనాలు నిమజ్జనం పాయింట్ నుండి జయశంకర్ విగ్రహం వరకు చేరుకొని ప్రకాష్ నగర్, శ్రీనివాస్ నగర్, జహీర్ పుర తండా, అయ్యప్ప టెంపుల్, వెంకటగిరి ఎక్స్ రోడ్ వైపు వెళ్లేవారు దంసలాపురం బ్రిడ్జిని దాటి బ్రిడ్జి కింది నుండి దంసలాపురం ఊర్లో నుండి ఎస్వీఎం స్కూల్ గుండా శ్రీనివాస నగర్, అయ్యప్ప టెంపుల్, ప్రకాష్ నగర్ వైపు వెళ్లి మెయిన్ రోడ్డు ద్వారా గమ్యస్థానాలకు వెళ్ళవచ్చును.ముస్తఫా నగర్, మమతా రోడ్, ఇల్లందు ఎక్స్ రోడ్, ఎన్టీఆర్, బల్లేపల్లి మామిళ్లగూడెం, న్యూ బస్టాండ్ రాపర్తి నగర్, రూరల్ పైపు వెళ్లేవారు జయశంకర్ విగ్రహం దగ్గర నుండి శ్రీరామ్ హిల్స్, రాఘవ మెడికల్స్ దగ్గర రోడ్ క్రాస్ చేసి పరికముక్కల కాలనీ ద్వారా అల్లిపురం ఎక్స్ రోడ్డుకు చేరుకొని అక్కడి నుండి టాటామోటార్స్,లకారం,మమత ఎక్స్ రోడ్డుకు చేరుకొని ఇందిరానగర్, శ్రీశ్రీ సర్కిల్ ద్వారా బైపాస్ కు చేరుకొని గమ్యస్థానాలకు వెళ్ళవచ్చు.వినాయక నిమజ్జనం అనంతరం బయటకు వెళ్లే దారులను కేవలం వన్ వే ట్రాఫిక్ మాత్రమే అనుమతించబడును కావున ప్రజలందరూ ఇట్టి విషయాన్ని గమనించి ట్రాఫిక్ పోలీస్ కి సహకరించగలరు.

# ధంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జనం కు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి...)



అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు.నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులో నీటిమట్టం ఉన్నందున బారికేడింగ్, గజ ఈతగాళ్లు, క్రేన్లు, బోట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి,పోలీసులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, రాత్రి నిమజ్జనాలకు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్,ప్రవేశ–నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేసి,అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఎత్తు కలిగిన గణేష్ విగ్రహాలకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక రూట్, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు, రవాణా ఏర్పాట్లు ముందుగానే చేయాలని ఆదేశించారు.భక్తులకు తాగునీరు,పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, నిమజ్జనం ప్రశాంతంగా,సురక్షితంగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటి పారుదల శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.షార్ట్ సర్క్యూట్ కు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు.ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనం, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లు, క్రేన్ మరమ్మతులు చేసే మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు.విగ్రహాల తరలింపుకు అడ్డుగా వచ్చే చెట్టు కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు.నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే చర్చించి వారికి విధుల షిఫ్ట్ వివరాలను తెలియజేయాలని అన్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేయాలని.అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచందర్,వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## చింతకాని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

(మొదటి పేజీ తరువాయి...)

సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో నిర్దేశిత ప్రామాణిక విధానాలను తప్పనిసరిగా పాటిస్తూ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అన్నారు. చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థులు, యువతతో పాటు ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, రహస్య సంఖ్యల ద్వారా జరిగే మోసాలు, డిజిటల్ చెల్లింపుల మోసాలు, నకిలీ లింకులు, డిజిటల్ అరెస్టులపై ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న కేసులను చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి, కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసులో దర్యాప్తు నాణ్యత, ఆధారాల సేకరణ, కేసు నమోదు వివరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి, వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, నేరస్తులపై నిఘా, ప్రజలకు భద్రత కల్పించే విషయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు.

## కోదాడ మెగా జాబ్‌మేళాలో సత్తా చాటిన యస్.బి.ఐ.టి. విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి...)

కరస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు. తెలంగాణా రాష్ట్రప్రభుత్వంతో పాటు తెలంగాణా రైజింగ్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణా డి.ఈ.ఈ.టి, టాస్క్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ యస్.సి.సి.యల్ సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళా 2026 కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేంధర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాదరావు, ఇరిగేషన్ శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎం.ఎల్.ఏ.పద్మావతి రెడ్డి పాల్గొని ఎంపికైన విద్యార్థులకు స్వయంగా నియామక పత్రాలను అందించినట్లు కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు.మెగా జాబ్‌మేళా 2026కు తమ కళాశాలకు చెందిన చివరి సంవత్సరం సి.యస్. ఈ., ఈ.సి.ఈ, ఈ.ఈ.ఈ.విద్యార్థులు పాల్గొనగా తమ కళాశాలలో అందించిన నిరంతర ట్రైనింగ్స్ ఉపయోగపడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా జి. రాజ్‌కుమార్ తెలిపారు. కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ వంటి వివిధ ఆధునిక, సాంకేతిక శిక్షణ ద్వారా ఈ ఘనత సాధించినట్లు, ఇటువంటి శిక్షణలు రానున్న రోజులలో మరింతగా అందించి బహుళజాతి సంస్థలకు ఎంపికయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. డా యన్.సవిత, డా జి. ప్రభాకర్, కె. ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం

- **తెలుగుదేశం కౌన్సిలర్ బోడెపుడి రేవతి**



**మధిర ప్రజా జ్యోతి** అన్నదానం మహాదానం అని పేర్కొంటూ వినాయక చవితి సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక సుందరయ్య నగర్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పదవ వార్డ్ తెలుగుదేశం కౌన్సిలర్ బోడెపూడి రేవతి హాజరై భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం కౌన్సిలర్ బోడెపూడి రేవతి మాట్లాడుతూ పండుగల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్నదానం ద్వారా భక్తులకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమని ఆమె తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నిర్వాహకులు, స్థానికులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ డీ మధు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్ సీనియర్ తెలుగుదేశం నాయకులు బోడెపుడి వెంకటేశ్వరరావు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు పాటిబండ్ల సత్యంబాబు కటికల సీతారామిరెడ్డి జగన్మోహన్రావు కౌన్సిలర్ ములకలపల్లి వినయ్ సీనియర్ పాత్రికేయులుసాంబిరెడ్డి మైలవరపు చక్రి తదితరులు పాల్గొన్నారు

## కల్లూరు లో ఘనంగా పోషకాహార మాస ఉత్సవాలు




**కల్లూరు, సెప్టెంబర్ 19 : ప్రజా జ్యోతి** పోషణ మాస ఉత్సవాల్లో భాగంగా కల్లూరు –2 అంగన్వాడి కేంద్రాల్లో తల్లుల సమావేశాన్ని నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహార పదార్థాలు అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న వేడి భోజనం అధికంగా ఉండే ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. తల్లులు పిల్లల్లో రక్తహీనత నివారణకు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు అంగన్వాడి కేంద్రాలలో అందించే భోజనాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని వార్డు కౌన్సిలర్ రాధా వీరస్వామి సూచించారు. పాఠశాల ఉపాధ్యాయుల సుధీర్ కుమార్ తక్కువ ఖర్చుతో లభించే పోషక విలువల అధికంగా ఉన్న ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాధా వీరస్వామి సెక్టార్ సూపర్వైజర్ ఉషారాణి ఉపాధ్యాయులు సుధీర్ కుమార్, గ్రామ పెద్ద కొత్తపల్లి వెంకటేశ్వర రావు, అంగన్వాడీ ఉపాధ్యాయులు జయమ్మ పిల్లలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# నవ సమాజ నిర్మాతలుగా విద్యార్థులు ఉండాలి

- జడ్జి మారగాని
- విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి






**సత్తుపల్లి సెప్టెంబర్19(ప్రజా జ్యోతి)** నవ సమాజ నిర్మాతలుగా విద్యార్థులు ఉండాలని 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణం లోని గవర్నమెంట్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులు చట్టాలపై అవగాహన కార్యక్రమం సత్తుపల్లి మండల సర్వీసు కమిటీ చైర్మెన్,6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాసరావు,సీనియర్ సివిల్ జడ్జ్ షేక్ జడ్జ మీరాసాహెబ్ ఖాసిం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ సమాజ నిర్మాతలుగా విద్యార్థులు ఉండాలని,చట్టాలపై అవగాహన ఉండాలని,బి యన్ ఎస్,సివిల్,క్రిమినల్, కోర్టు కేసుల గురించి క్షుణ్ణంగా వివరించారు. సమాజంలో మంచి,చెడు తెలుసుకోవాలని, మంచిని మాత్రమే గ్రహించాలని, లక్ష్యంతో చదివి ఉన్నత లక్ష్యంగా ఉండాలని, క్రమశిక్షణతో ఉంటూ, జీవితాన్ని ముందుకు సాధించాలని, తల్లిదండ్రులకు, సమాజానికి,అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని, డ్రగ్స్ కి దూరంగా ఉండాలని,18 సంవత్సరాలు పూర్తిగా వచ్చిన వాళ్ళు లైసెన్స్ కలిగి ఉండాలని, అప్పుడే వాహనాలను నడపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## ఖమ్మం సర్వ జన ఆసుపత్రిలో అందుబాటులో మానసిక వైద్య సేవలు

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక పర్యవేక్షణలో మెరుగైన సేవలు
- వ్యసన విముక్తి చికిత్సలతో బాధిత కుటుంబీకుల్లో ఆనందం
- వైద్య సేవలతో పాటు అవగాహన కార్యక్రమాలు








**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా సర్వ జన ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మెరుగైన వైద్యంతో పాటు మానసిక వైద్య విభాగం బాధితులకు విశిష్ట వైద్య సేవలు అందిస్తూ నూతన జీవితాన్ని అందిస్తోంది.సాధారణ మానసిక సమస్యల మొదలుకొని, వ్యసన విముక్తి, చట్టపరమైన సంరక్షణ దాకా ఎన్నో విభాగాలలో ప్రత్యేక శ్రద్ధతో ప్రజలకు ఉచితంగా సేవలు అందిస్తుంది.సాధారణ మానసిక వైద్య సేవల విభాగంలో సాధారణ మానసిక వైద్య చికిత్సలతో పాటు మాతా-శిశు మానసిక ఆరోగ్యం,బాల్యము నుండి వృద్ధాప్యం వరకు వచ్చే వివిధ రకాల మానసిక సమస్యలకు వ్యాధి నిర్ధారణ, సంపూర్ణ చికిత్స సేవలు అందుతున్నాయి. ఇక్కడ నెలకు సుమారు 300 వరకు కేసు నమోదవుతుండగా, ఒక్కో కేసుకు వ్యాధి తీవ్రతను బట్టి 3 నుండి 5 సంవత్సరాల కాలపరిమితితో చికిత్స అందిస్తున్నారు.వ్యసన విముక్తి సేవల్లో భాగంగా మద్యం , పొగాకు,సిగరెట్ , గంజాయి, చరష్, ఓపియాయిడ్ వంటి మాదక ద్రవ్యాల బారిన పడిన వారికి ఇక్కడ పునరావాస సేవలు అందుతున్నాయి. వ్యసన విముక్తికి బాధితులకు కౌన్సిల్లింగ్, అవసరమైన వైద్య సేవలు అందించి, వారికి తిరిగి యధాస్థితి జీవితాన్ని ప్రసాదించడానికి అన్ని విధాల చేయుత అందిస్తున్నారు. దీనితో బాధితుని కుటుంబీకులు ఎంతో ఆనందాన్ని వెలిబుచ్చుతున్నారు.సాధారణ డి-ఎడిక్షన్ తో ప్రతి నెలా దాదాపు 60 కేసులలో వ్యసన ప్రభావం నుండి స్వేచ్ఛను, పునరావాసాన్ని కల్పిస్తున్నారు. కేసులో బాధితుని స్థితిని బట్టి సమయానుసారంగా తగుచర్యలు చేపట్టడం జరుగుతుంది.మాదక ద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి 8 వారాల పాటు ప్రతి వారం కౌన్సెలింగ్,మార్గదర్శకత్వం ఇస్తారు. ఆ తర్వాత 'ర్యాపిడ్ డ్రగ్ ప్యానెల్ పరీక్షలు చేసి, ఫలితం నెగెటివ్ అని వస్తే న్యాయస్థానానికి నివేదిక ఇచ్చి కేసు కొట్టేసేలా విజ్ఞప్తి చేస్తారు. వైద్య-న్యాయ సంబంధిత సేవలు ఈ విభాగంలో నెలకు 20 కేసులు నమోదు కాగా, నెలకు సగటున 5 గురు వ్యసనం నుండి పూర్తిగా బయటపడి మార్పు చెందుతున్నారు.ప్రతి గురువారం ఆసుపత్రిలోని ప్రత్యేక గదిలో ట్రాన్స్ జెండర్ల కోసం ఒ.పి నిర్వహిస్తున్నారు.వివక్ష లేకుండా రహస్యంగా నిపుణులైన వైద్యులతో చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నారు.ప్రత్యేక సేవలు & క్లినిక్‌లు ట్రాన్స్ జెండర్ క్లినిక్ కు నెలకు సగటున 5 కేసులు వస్తున్నాయి.మానసిక వైద్య విభాగం ద్వారా పోక్సో బాధితులకు సేవలు అందించడం జరుగుతుంది.18 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న బాలబాలికలకు లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించే చట్టం కింద మానసిక స్థితి విశ్లేషణ, కౌన్సెలింగ్, వైద్యం, న్యాయస్థానానికి నివేదికలు సమర్పిస్తున్నారు.నెలకు సుమారు 10కేసులు వస్తుండగా సర్వ జన ఆసుపత్రి తగు చర్యలు తీసుకుంటున్నది.ఖైదీలకు మానసిక చికిత్సలో భాగంగా జైలు నుండి డిమాండ్ ఆధారంగా తీసుకొచ్చే ఖైదీలకు మందులు మరియు కౌన్సెలింగ్ ద్వారా చికిత్స అందిస్తారు. నేషనల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ క్రింద సామాజికంగా బలహీనంగా ఉంటే గుర్తించి ఉచిత న్యాయ సహాయం అందేలా చూస్తున్నారు. నెలకు సుమారు 10 మంది ఖైదీలు సమస్యలతో సర్వ జన ఆసుపత్రికి వస్తుండగా, సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది.మెడికల్ బోర్డు సేవలు, యు డి ఐ డి క్రింద నెలకు ఇద్దరు చొప్పున ప్రభుత్వ ఉద్యోగుల మానసిక స్థితిని పరీక్షించి పెన్షన్,వారసత్వ హక్కుల కోసమై 'పనిచేయడానికి అనర్హులు' అని ధృవీకరణ పత్రాలు ఇస్తారు. అలాగే ఆధారంగా నెలకు 80-100 మందికి మానసిక వైకల్య శాతాన్ని నిర్ధారించి 'దివ్యాంగుల సర్టిఫికేట్లు' ( యు డి ఐ డి ) ఇస్తున్నారు.ఈ సంవత్సరం జనవరి – ఆగస్టు 26 వరకు సర్వ జనాసుపత్రిలో పోస్కో కేసులు 52, డి-ఎడిక్షన్ 452, సాధారణ ఓ.పి 1809,ఇన్-పేషెంట్ 67,ట్రాన్స్ జెండర్ 09,ఖైదీలు 51, ఫొరెన్సిక్ డి-ఎడిక్షన్ 55 కేసులకు చికిత్సలు అందించాం.విద్యా సేవలు,విద్యార్థులకు శిక్షణకు సర్వ జన ఆసుపత్రి ద్వారా చర్యలు చేపడుతున్నారు. ఇక్కడ ఎంబిబిఎస్ 3వ సంవత్సరం విద్యార్థులకు, ఇంటర్న్‌షిప్ చేసే కొత్త వైద్యులకు క్లినికల్ స్కిల్స్, మానసిక సమస్యలను గుర్తించే విధానంపై తరగతులు నిర్వహిస్తున్నారు. అంతేగాక డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్' ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్ సైకియాట్రీ విద్యార్థులకు పూర్తి శిక్షణ ఇస్తున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం'ఆత్మహత్యల నివారణ దినోత్సవం' వంటి సుమారు 20 సందర్భాలలో ప్రజలలో, విద్యార్థులలో అవగాహన సదస్సులు నిర్వహించారు.ప్రస్తుతం ఈ విభాగంలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక సీనియర్ రెసిడెంట్ , ఒక డి ఆర్ పి పిజి వైద్యుడు, నర్సింగ్ సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. తగినంత మంది నిపుణులు లేకపోవడంతో సేవలకు కొంత ఆటంకం కలుగుతోందని, వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఇతర సైకియాట్రిక్ వైద్యులను ఇక్కడకు డెప్యుటేషన్‌పై నియమిస్తే మరింత మెరుగైన సేవలు అందించవచ్చని, ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తున్నారు. రాబోయే కాలంలో సర్వ జన ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగాన్ని మరింత పటిష్టం చేసి,బాధితులకు సత్వర చికిత్సలు అందేలా అన్ని చర్యలు చేపడుతున్నారు.

## టాలెంట్ స్కూల్లో నో బ్యాగ్ డే



**సత్తుపల్లి సెప్టెంబర్19(ప్రజా జ్యోతి)** చదవంటే కేవలం రోటీన్ గా క్లాసులు వినడం, హోం వర్కులు రాయడమే కాదని చెబుతూ, విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలుగు తీసేందుకు, స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్ లో నో బ్యాగ్ డే ను జరుపుకున్నారు. విద్యార్థులకు చదివే కాకుండా, చదువుతోపాటు సమాజంలోని అనేక విషయాలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో, మొక్కలు నాటించడం, ఆ తర్వాత విద్యార్థులు ఆటలు, పాటలతో ఉల్లాసంగా ఆనందించారు. సాయంత్రం క్విజ్ పోటీలు , కొన్ని యాక్టివిటీస్ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఈ విధంగా చేయడం వలన వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చని, విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ముందుండాలని, ఎలాంటి కార్యక్రమాలు ఎంతగా ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

- ఎంపీడీవో బి. పద్మ



**కారేపల్లి, సెప్టెంబర్ 19, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలం లో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో ఏక్ పెడ్ మాకే నామ్ అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని శనివారం జిల్లా పరిషత్ హై స్కూల్ కారేపల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఎంపీడీవో బి. పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రతి ఒక్క విద్యార్థి ఒక్కొక్క మొక్క నాటాలి అని విద్యార్థులకు తెలియజేసి,ప్రతి ఒక్క విద్యార్థిచేత ఒక్కొక్క మొక్క నాటించారు . ఈ కార్యక్రమంలో సింగరేణి సర్పంచ్ మేదర టోనీ , సింగరేణి పంచాయతీ కార్యదర్శి బి. నెహ్రూ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. విజయ కుమారి, కారేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమ్, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఏపీవో. బి. కోటేశ్వరరావు,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేంసూరు మండల ఎమ్మార్పిస్ అధ్యక్షులు గా ఖమ్మం పాటి వేణు ఎంపిక



**వేంసూరు సెప్టెంబర్ 19 ప్రజాజ్యోతి** వేంసూర్ మండల ఎంఆర్పిఎస్ ఎంఎస్పి సెప్టెంబర్ 18 వ తారీఖున మండల కమిటీ ఎన్నికల జరిగింది ఈ మండల కమిటీకి ముఖ్యఅతిథిగా ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ మరియు ఖమ్మం జిల్లా ఎం ఎస్ పి మాజీ అంజయ్య మాదిగ పాల్గొనడం జరిగింది మరియు మండల ఇన్చార్జి కోటమర్తి బాలస్వామి ఎం ఎస్ పి మాజీ మండల అధ్యక్షులు కినరత్నకుమార్ మరియు కనకపుడి రవి గారు ప్రసాద్ మండలంలోని గ్రామ అధ్యక్షులు సీనియర్ నాయకులు పాల్గొనడం జరిగింది మరి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా ఖమ్మంపాడు వేణు ఏకేగ్రహంగా ఎన్నుకోవడం జరిగింది మరియు ఎం ఎస్ పి మండల అధ్యక్షునిగా కోట వెంకటేశ్వరరావు ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమం లో అన్ని గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఈ నెల 21న సోమవారం ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య పరిపాలనా కారణాల రీత్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మండల,డివిజన్ల స్థాయిలో నిర్వహించబడే ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా సోమవారం మధ్యాహ్నం 1.00గంట వరకు నిర్వహించబడుతుందని కలెక్టర్ అన్నారు.ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఖమ్మంలో ఐటీడీఏ కార్యాలయము ఏర్పాటు చేయాలి

- కారేపల్లి లో 50 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలి
- భూక్యా వీరభద్రం



**కారేపల్లి, సెప్టెంబర్ 19, ప్రజా జ్యోతి:**ఖమ్మం కేంద్రంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఐటీడీఏను ఏర్పాటు చేయాలని, సింగరేణి మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సింగరేణి మండల కేంద్రంలోని భాగం రామ నరసయ్య భవన్‌లో శనివారం తెలంగాణ గిరిజన సంఘం మండల కమిటీ విస్తృత సమావేశం మండల అధ్యక్షులు అజ్మీరా శోభన్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో భూక్యా వీరభద్రం మాట్లాడుతూ తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ మహాసభల పోస్టర్‌ను గిరిజన సంఘం నాయకులతో కలిసి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు భూక్యా రంజిత్ నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండల పరిధిలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించి, తండా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న మండల మహాసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల మహాసభను, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి గిరిజనులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేసి, మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం మండల కార్యదర్శి, ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బానోతు బన్సీలాల్ నాయక్, మండల నాయకులు మాలోతు బాలు నాయక్, బానోతు శ్రీనివాస్ నాయక్, భూక్యా రాంబాబు నాయక్, భూక్యా రమేష్, అజ్మీరా శ్రీను, బానోతు కిషన్ నాయక్, ధర్మశోత్ సూర్య నాయక్, భూక్యా పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కూలీలకు అండగా ఉంటా

- రావి రాజారావు



**వేంసూరు సెప్టెంబర్ 19 ప్రజాజ్యోతి**

వేంసూరు మండలం అడసర్లపాడు గ్రామానికి చెందిన హమాలీ కార్మికులకు అండగా ఉంటానని పనికి తగిన కూలీ ధరల పెంపుకు సహకరిస్తా అని ప్రభుత్వం నిర్ణయించిన కూలీ ధర కన్నా ఎక్కువ ఇచ్చేలా చేస్తానని ఫెర్టిలైజర్స్ యాజమానుల సంఘం,రేషన్ డీలర్స్ సంఘం సీనియర్ నాయకులు రావి రాజారావు స్పష్టం చేశారు.శనివారం తన 68 వ జన్మదినం సందర్భంగా ఆయనను కలిసిన హమాలీలకు హామీ ఇచ్చారు. హర్షం వ్యక్తం చేసిన హమాలీ కార్మికుల నేత,తెలంగాణా రజక సేవా సంఘం అధ్యక్షులు తాళ్లూరి.రామారావు ఆధ్వర్యంలో రాజారావుకు హమాలీ కార్మికులు, చిన్న సన్నకారు రైతులు మిఠాయిలు తినిపించారు.రావికు శుభాకాంక్షలు తెలిపారు.

# పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలే లక్ష్యంగా ఉచిత శిక్షణ

- బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో కార్యక్రమం
- ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో యువతకు శిక్షణ
- పంచాయతీ కార్యాలయంలో 10 కంప్యూటర్లు ఏర్పాటు
- పల్లె ప్రకృతి వనంలో శారీరక శిక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు
- అభ్యర్థులకు క్రమశిక్షణ శారీరక వ్యాయామం పట్టుదల అవసరం
- సర్పంచ్ బానోతు జ్యోతి కొండ






**బోనకల్, సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి)** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణతో పాటు శారీరక దారుఢ్యానికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.ఈ సందర్భంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతలో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, శిక్షణ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మంది తమ లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని అన్నారు. అలాంటి యువతకు అండగా నిలవాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు పంచాయతీ కార్యాలయంలో 10 కంప్యూటర్లను ఏర్పాటు చేసి, అభ్యర్థులకు పోటీ పరీక్షల సన్నద్ధతకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు అభ్యర్థులు సులభంగా సిద్ధమయ్యేలా అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.అదేవిధంగా బోనకల్‌లోని పల్లె ప్రకృతి వనాన్ని శిక్షణ కేంద్రంగా వినియోగిస్తూ, పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలకు అవసరమైన పరుగు, వ్యాయామం, శారీరక దారుఢ్య శిక్షణను ఉచితంగా అందిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామ యువతకు ఆరోగ్యకరమైన వాతావరణంలో శారీరక శిక్షణ అందించేందుకు ప్రకృతి వనంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

**యువతకు అండగా బోనకల్ గ్రామపంచాయతీ...**

నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే కష్టపడి చదవడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో అవసరమని బానోతు జ్యోతి కొండ అన్నారు. ముఖ్యంగా పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాల్లో చేరాలనుకునే యువత విద్యతో పాటు శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తూ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.గ్రామీణ ప్రాంత యువతకు ఉచితంగా శిక్షణ, కంప్యూటర్ సౌకర్యం, శారీరక శిక్షణ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలన్నదే గ్రామ పంచాయతీ పాలకవర్గం లక్ష్యమని పేర్కొన్నారు.

**ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారం అభినందనీయం : సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ**

బోనకల్ గ్రామ యువత కోసం గ్రామ పంచాయతీ చేపడుతున్న కార్యక్రమానికి ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారం అందించడం అభినందనీయమని సర్పంచ్ అన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాల దిశగా మార్గనిర్దేశం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగం, దేశ సేవ అనే లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో నిరంతరం శ్రమిస్తే ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం సాధ్యమేనని అన్నారు. అందుబాటులో ఉన్న ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ర్యాలీ.. వైద్య పరీక్షలు...**

కార్యక్రమంలో భాగంగా అభ్యర్థులతో కలిసి బోనకల్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ రవీందర్‌నాథ్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిక్షణలో పాల్గొనే అభ్యర్థుల శారీరక సామర్థ్యం, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు 6300691495, 8374844996 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో భవిష్య ప్రాజెక్ట్ మేనేజర్ జీ.శ్రీనివాస్, ఫీల్డ్ కోఆర్డినేటర్లు కే. వెంకటేశ్వరరావు, జి. గోపి, శారీరక శిక్షకులు ఎం.డి. హసద్, ఎం. కృష్ణ మోహన్, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ సంస్థ నిర్వాహకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# గణపతి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**బోనకల్ , సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి):**మండల కేంద్రంలోని గ్రామంలో బొడ్రాయి సెంటర్ దగ్గర యార్లగడ్డ దుర్గాప్రసాద్ విజయ ఇంటిముందు కొలువై ఉన్న శ్రీ మహాగణపతి దగ్గర గణపతి యూత్ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు. బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి , ఉప సర్పంచ్ బానోతు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినారు. ఉప సర్పంచ్ బానోతు కొండ మాట్లాడుతూ... మనము ఏ శుభకార్యము జరుపుకొన్న ముందుగా గణనాథుడికి పూజలు చేసుకుని ప్రారంభిస్తామని అంతటి మహిమ కల దేవుడిని నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మరల తన తల్లి అయిన గంగమ్మ ఒడిలోకి చేర్చడం సంతోషకరమైన విషయం మని, అలాగే అందరూ మట్టి విగ్రహాలు పెడితే ఇంకా చాలా సంతోషకరమైన విషయమని ,మట్టితో చేసిన విగ్రహాలు మన చెరలో నిమజ్జనం చేస్తే పంట పొలాలకు కానీ అందులో పెంచే చేపలకి కానీ ఎలాంటి హాని ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుండపనేని సుధాకర్ రావు. తేల్లూరి రమేష్, మోర్ల శ్రీను, చిట్టోజి శ్రీనివాస్, గంగుల పుల్లయ్య, మల్లెల వేలాద్రి, వరుగు నరసింహారావు, షేక్ మీరా సాహెబ్, షేక్ పెద్ద మీరా, మరీదు శివకృష్ణ, విగ్రహ దాతలు మోర్ల ఆంజనేయులు గారు. కమిటీ సభ్యులు. యార్లగడ్డ దుర్గాప్రసాద్, యార్లగడ్డ విజయ, మరీదు దుర్గ, మరీదు వెంకటేశ్వర్లు ,దొంతు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని పూజల్లో పాల్గొన్న కూసంపూడి



**సత్తుపల్లి సెప్టెంబర్19(ప్రజా జ్యోతి )**గణేశ్ నవరాత్రుల సందర్భంగా 3వార్డు, 14 వ వార్డు గాంధీనగర్ లో ఏర్పాటు చేసిన గణనాథని ఉత్సవాలలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలంతా గణనాథుడి ఆశీస్సులతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నిమజ్జనానికి ఏర్పాట్లు చేయగా దగ్గరుండి గణనాథుని పూజలు చేసి, నిమజ్జనం జాగ్రత్తగా చేయాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాలని ,తగు సలహాలు సూచనలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మేకల నరసింహారావు, క్లబ్బు వెంకన్న, షేక్ బాబు, మిద్దె శీను, దావూద్ ,షేక్ చాంద్ పాషా ,అద్దంకి అనిల్ ,గంద్ర రఘు, జొన్నలగడ్డ కృష్ణ, తడికమళ్ళ సాల్మన్ , బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా బ్రాంచ్ పాలకవర్గ సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ముఖ్య ప్రణాళికా అధికారి,ఎన్నికల అధికారి,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీనివాస్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా బ్రాంచ్ యొక్క పాలకవర్గ సభ్యుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటీసు,షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి,జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి ఏ. శ్రీనివాస్ శనివారం విడుదల చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు.మొత్తం 15 జిల్లా కార్యవర్గ సభ్యుల స్థానాలకు గాను ఈ ఎన్నికలు జరగనున్నాయని, నామినేషన్ రుసుము రూ.10,000 తిరిగి చెల్లించబడదు గా నిర్ణయించామన్నారు.ఎన్నికల నామినేషన్ల దాఖలు ఈ నెల 24 న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఐడిఓసి, కలెక్టరేట్, ఖమ్మం నందు స్వీకరిస్తారని తెలిపారు. నామినేషన్ల పరిశీలన ఈ నెల 25 న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఉంటుందని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 26 న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఉంటుందని, అర్హమైన నామినేషన్ల తుది జాబితాను ఈనెల 26న మధ్యాహ్నం 3:00 గంటల తర్వాత ప్రకటిస్తామన్నారు. ఏకగ్రీవ అభ్యర్థుల ప్రకటన (పోటీ లేని పక్షంలో) ఈ నెల 26న సాయంత్రం 5:00 గంటల తర్వాత చేయనున్నట్లు ఎన్నికల అధికారి అన్నారు.పోలింగ్ ను అక్టోబర్ 4 న (ఆదివారం) ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 3:00 వరకు టీటీడీసీ భవనం, ఇల్లందు క్రాస్ రోడ్, రామాలయం దగ్గర, ఖమ్మం లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఓట్ల లెక్కింపు, ఫలితాలు & ఆఫీస్ బేరర్ల ఎంపిక అక్టోబర్ 4 న పోలింగ్ ముగిసిన తదుపరి చేపట్టనున్నట్లు అన్నారు.నామినేషన్ పత్రాలను ఐడిఓసి, కలెక్టరేట్ ఖమ్మంలోని రూమ్ నెం: F–27 ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం నందు పొందవచ్చని, పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ పత్రమును స్వయంగా మొదటి మరియు రెండవ ప్రపోజర్లతో కలసి ఎన్నికల అధికారికి అందజేయాలని అన్నారు. ఒక వ్యక్తి ఒక్క అభ్యర్థికి మాత్రమే ప్రపోజర్ గా (మొదటి లేదా రెండవ) ఉండాలని, నామినేషన్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను సమర్పించాలని అన్నారు. ఓటు వేయడానికి వచ్చే సభ్యులు తప్పనిసరిగా ఐఆర్సిఎస్ గుర్తింపు కార్డు / ఆధార్ కార్డు లేదా ఇతర ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తెచ్చుకోవాలన్నారు.మరిన్ని వివరాలకు, ఓటర్ల జాబితా కొరకు ఎన్నికల అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఎన్నికల అధికారి/ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

# టియూడబ్ల్యూజె (ఐజెయూ) ఆధ్వర్యంలో 21న హెల్త్ క్యాంప్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఈ నెల 21న సోమవారం ఉదయం 10 గంటలకు టియూడబ్ల్యూజె (ఐజెయూ) ఆధ్వర్యంలో జర్నలిస్టులకు హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు టియూడబ్ల్యూజె (ఐజెయూ) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నామా పురుషోత్తం, శీలం శ్రీనివాస్,కోశాధికారి పిన్ని సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యశోద క్లినిక్ సెంటర్ లో యశోద హాస్పిటల్ వైద్యులచే పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ వైద్య శిబిరాన్ని అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారని, ఈ కార్యక్రమానికి జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి గౌస్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ ఖాదర్ బాబా, టియూడబ్ల్యూజె (ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాం నారాయణ హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఇంకా యూనియన్ రాష్ట్ర, జిల్లా, నగర బాధ్యులు ,నాయకులు హాజరు కానున్నారని తెలిపారు.ఈ.శిబిరం లో గుండె పరీక్షలతో పాటు ఇతర జనరల్ వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. 21న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని జర్నలిస్ట్ మిత్రులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి వినియోగించుకోగలరని కోరారు.

# హస్నాబాద్‌లో భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ

- సొంత ఖర్చులతో సేవా కార్యక్రమం చేపట్టిన. ఉప సర్పంచ్ మాగి బాలకృష్ణ
- కార్యక్రమాన్ని ప్రారంభించిన రామసహాయం నరేష్‌రెడ్డి

**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 19:** భక్తి భావంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంతో హస్నాబాద్ గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్‌లో, ఉప సర్పంచ్ మాగి బాలకృష్ణ తన సొంత ఖర్చులతో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 300 మందికిపైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామసహాయం నరేష్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ సొంత ఖర్చులతో అన్నదానం నిర్వహిస్తూ భక్తులకు సేవ చేయడం అభినందనీయమన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం గొప్ప సేవా కార్యక్రమమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తిని కలిగిస్తాయని పేర్కొన్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అన్నప్రసాదాన్ని భక్తులకు క్రమబద్ధంగా వడ్డించడంతో కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది. గ్రామస్తులు, నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో హస్నాబాద్.గ్రామ సర్పంచ్ కొవ్వూరి పద్మ సత్తిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంగబత్తుల సుమన్‌రెడ్డి, సుబ్లేడు ఉపసర్పంచ్ భూక్య ఖనిల్, బండారు పాపిరెడ్డి, బండారి సత్తిరెడ్డి, తండా అంజయ్య, పంచాయతీ కార్యదర్శి నర్మద, కొత్త వెంకన్న (పాల ), వార్డు సభ్యులు పల్లి గోపి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాతిక ఉపేందర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బాతిక లింగయ్య, మాగి బాబు, మాగి లక్ష్మణ్, మాగి మధు, మాగి సాయి, మాజీ వార్డు సభ్యులు అనంతుల ఉప్పమ్మ, రామసాని పార్వతి తదితరులు పాల్గొన్నారు.




# జగన్నాధపురంలో ఘనంగా పోషణ మాసం

- పోషకాహారంపై అవగాహన కల్పించిన సర్పంచ్ తాళ్లూరి స్వప్న, సూపర్వైజర్ సంధ్యారాణి



**చింతకాని సెప్టెంబర్19(ప్రజా జ్యోతి)** జగన్నాధపురం గ్రామంలో తొమ్మిదవ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజల్లో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే టేక్ హోమ్ రేషన్ పోషకాహార పదార్థాలతో తయారు చేసిన వివిధ రకాల వంటకాల ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జగన్నాధపురం గ్రామ సర్పంచ్ తాళ్లూరి స్వప్న ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐసీడీఎస్ చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి ప్రత్యేకంగా పాల్గొని పోషణ మాసం ప్రాధాన్యతను వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. గ్రామంలో పోషకాహారంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి కృషి చేస్తామని తెలిపారు.సూపర్‌వైజర్ సంధ్యారాణి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే టి హెచ్ ఆర్ ఆహార పదార్థాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం హేమలత, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ పొల్లూరు వెంకటేశ్వర రావు,వార్డు సభ్యులు తన్నీరు రమాదేవి, అంగన్వాడి టీచర్ కాసిమాల వెంకమ్మ, ఆశ బందెల అరుణ, ఆయా యర్రమల పద్మ,కాంగ్రెస్ నాయకులు తాళ్ళూరి రమేష్,గర్భిణీలు, బాలింతలు, తల్లులు, గ్రామ ప్రజలు, పిల్లలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ
- ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో "ఎక్ ఫెడ్ కే నామ్" కార్యక్రమం
- కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం



**బోనకల్, సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎక్కువ క్లబ్ , ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో "ఏక్ పెడ్ కే నామ్" ( తల్లి పేరుతో ఒక మొక్క ) కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లింగం నేని నళిని శ్రీ అధ్యక్షత న జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోనకల్ సర్పంచ్ బాణోత్ జ్యోతి , ఉప సర్పంచ్ బాణోత్ కొండ , గ్రామపంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి హాజరై కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కళాశాలలో ప్రతి ఒక్క విద్యార్థి ఒక్క మొక్కను నాటాలి అని సర్పంచ్ బాణోత్ జ్యోతి విద్యార్థులను ఆదేశించారు. విద్యార్థుల చేత స్లోగన్స్ , మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు , అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, శాంతి ప్రియ, లైబ్రరీన్ మోహన్, యుడిసి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# భరణిపాడు ఎమ్మార్పిస్ గ్రామ అధ్యక్షులు గా పరసా భాస్కర్ రావు ఏకగ్రీవంగా ఎంపిక



**వేంసూరు సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి** ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మండల అధ్యక్షులు కలిసి గ్రామ గ్రామాన్ని తిరుగుతూ ఎమ్మార్పీఎస్ కమిటీలు వేయటం జరిగింది. భరణి పాడు గ్రామం నుంచి పరస భాస్కరరావును ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా గ్రామ సభ్యులందరూ ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షులు భాస్కరరావు మాట్లాడుతూ ఎంఆర్పిఎస్ తన అధ్యక్షతన గ్రామాల్లోని ప్రతీకార్యాన్ని విజయవంతం చేస్తూ ఎంఆర్పిఎస్ యొక్క పోరాటాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ తన ముందు ఉన్న నా బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పుకొచ్చారు మా గ్రామంలో ఎమ్మార్పీఎస్ విషయంలో గ్రామ శాఖ ఉద్యమ పోరాట విషయంలో చాలా నీరసంగా ఉంది ఇప్పుడు నుంచి ఈ గ్రామంలో ప్రతి కార్యాన్ని మీద వేసుకొని గ్రామంలో ప్రతి కార్యక్రమాన్ని ఎంఆర్పిఎస్ తరపున విజయవంతంగా నడిపిస్తానని ఈ సందర్భంగా పరస భాస్కర్ రావు చెప్పుకొచ్చారు.

# జీళ్ళచెరువులో వినాయక విగ్రహం వద్ద ఆకట్టుకున్న సంకీర్తన



**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి** కూసుమంచిమండలంలోని జీళ్ళచెరువు గ్రామంలో బొడ్రాయి బజార్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం రాత్రి ఉత్సవం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భక్త భజన మండలి సభ్యులతో సంకీర్తన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, భక్తులను ఆకట్టుకుంటుంది. హనుమాన్ చాలీసా, సంకీర్తన పారాయణంతో భజన బృందం సభ్యులు పాటలను ఆలపించారు. అనంతరం వినాయకుడికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు అంబాల వెంకటేశ్వర్లు–సత్యావతి, వినోద్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ పెంద్ర అంజయ్య, సభ్యులు ముద్రబోయిన వెంకటనారాయణ, వీరబాబు, సైదులు, మీరా, బెజవాడ శ్రీకాంత్, కొండా నగేష్, యాదగిరి పాల్గొనగా, భజన బృందం సభ్యులు చెన్నా వెంకన్న, చెన్నా విజయ్, అంబాల సైదులు, గోగుల అంజయ్య, చెన్నా వీరభద్రం, చారి, భాస్కరచారి తదితరులు పాల్గొని పాటలు పాడారు.

## మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం



**బోనకల్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి ):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రావినూతల సర్పంచ్ భూక్య భద్రునాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రావినూతల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో "అమ్మ పేరుతో ఒక మొక్క" అనే నినాదంతో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ భద్రు నాయక్ మాట్లాడుతూ.. స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని అన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు చెట్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య మాట్లాడుతూ... మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నియంత్రించవచ్చునని, ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రావినూతల ఉపసర్పంచ్ దొండపాటి సత్యనారాయణ, ఈజీఎస్ ఏపీఓ బసవోజు కృష్ణకుమారి, రావినూతల పంచాయితీ కార్యదర్శి వినోద్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి మధిర మణిహారం

- పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం
- మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం
- పండుగలు ప్రజల ఐక్యతకు, సోదరభావానికి ఎంతగానో దోహదం చేస్తాయి
- యువత ఉత్సవాలకే పరిమితం కాకుండా సామాజిక సేవా రంగంలో ముందుకు రావాలి

**మధిర ప్రజా జ్యోతి** మతసామరస్యానికి మధిర పట్టణం ప్రతీకగా నిలుస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం పేర్కొన్నారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్,టీచర్స్ కాలనీల్లో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కొలువుదీరిన గణేష్ మండపాలను శనివారం ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొని పూజలు నిర్వహించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ,ప్రజల మధ్య ఐక్యతను,సోదరభావాన్ని పెంపొందించేందుకు పండుగలు,ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని స్పష్టం చేశారు.మన పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని అన్నారు.అన్ని వర్గాల వారు పండుగలను సమష్టిగా, వైభవంగా నిర్వహిస్తూ ప్రజా ఐక్యతను చాటడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఈ వేడుకలు సమాజంలో ఆత్మీయతను,పరస్పర ప్రేమానురాగాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.నేటి యువత కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, సమాజహితం కోరి సామాజిక సేవా రంగాల్లో చురుగ్గా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కర్నాటి కిరణ్, రావూరి శ్రీను, 8వ వార్డ్ కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు,9వ వార్డ్ కౌన్సిలర్ వై. చారులత,రిటైర్డ్ ఎంఈఓ వై. ప్రభాకర్,పి ఆర్ టి యు నాయకుడు ఆర్ బ్రహ్మారెడ్డి,కాంగ్రెస్ నాయకులు దోర్నాల వెంకట రవి, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా 'నో బ్యాగ్ డే' మరియు పీటీఎం సమావేశం

- డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో విద్యార్థుల సందడి
- ఆంగ్ల పఠన ప్రతిభావంతులకు 'స్టార్ ఆఫ్ ద వీక్' అవార్డుల ప్రదానం




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని ఎంపీపీఎస్ వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం 'నో బ్యాగ్ డే' వేడుకలతో పాటు తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ పుస్తకాల సంచీలు లేకుండా బడికి వచ్చిన విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పలు రకాల విజ్ఞాన, వినోదాత్మక పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా డ్రాయింగ్ కాంపిటీషన్, జనరల్ నాలెడ్జ్ పెంచే క్విజ్ పోటీలతో పాటు మానసికోల్లాసం కలిగించే ఫన్నీ గేమ్స్ చేపట్టారు. విద్యార్థులందరూ ఎంతో ఉల్లాసంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు.అనంతరం మధ్యాహ్నం 2:00 గంటలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెల్లంకి నాగరాజు అధ్యక్షతన తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం నాగరాజు మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 'జాయ్‌ఫుల్ ఇంగ్లీష్ రీడింగ్' విధానం ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల పఠన సామర్థ్యాలు ఎంతగానో మెరుగుపడ్డాయని వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ముందే టెక్స్ట్ బుక్స్ అనర్గళంగా చదివి చూపించి ప్రశంసలు అందుకున్నారు. పిల్లలకు నైతిక విలువలు నేర్పాలని, వారు సాధించే ప్రతి పురోగతిని ప్రోత్సహించాలని కోరారు. అలాగే పిల్లలను సెల్‌ఫోన్‌లు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలని, సమయపాలన పాటిస్తూ పాఠశాలకు రోజూ పంపించి హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. గణితంలో వర్డ్ ప్రాబ్లమ్స్ సాధనపై దృష్టి పెడుతూ, రాబోయే ఎఫ్ఏ–2 పరీక్షలకు ఇంటి వద్ద విద్యార్థులను సంసిద్ధం చేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ఆకట్టుకున్న 'స్టార్ ఆఫ్ ద వీక్' అవార్డులు:గత సంవత్సరం తరహాలోనే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు 'స్టార్ ఆఫ్ ద వీక్' కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. తరగతి గదిలో ఆంగ్ల పఠనంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి, క్లాస్‌కు ఒకరి చొప్పున 'స్టార్ బ్యాడ్జ్' ధరింపజేసి, ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆర్. రామారావు, ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ రవి సంతోషం, పాఠశాల సిబ్బంది కవిత, లక్ష్మి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- సర్పంచ్ రామకోటారెడ్డి




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపొందించడమే ఏకైక మార్గమని, వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సర్పంచ్ శీలం రామకోటారెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం నరసింహపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలకు సకాలంలో నీరు అందించడం, రక్షణ కల్పించడం, వాటి ఎదుగుదలను పర్యవేక్షించడం తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు.మొక్క నాటితే బాధ్యత తీరినట్లు కాదని.. అది మహావృక్షంగా ఎదిగే వరకు కాపాడినప్పుడే వన మహోత్సవానికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు.పాఠశాల విద్యార్థులు వన మహోత్సవంలో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద, పాఠశాల ఆవరణల్లో, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ప్రస్తుతం పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గామాసు జోగయ్య ఉపాధ్యాయురాలు కనకదుర్గ, గ్రామ పెద్దలు మేరుగుమళ్ళ కృపారావు, కాళేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే మహాదానం

- కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ తిరుపతిరెడ్డి
- మూడవ వార్డులో ఘనంగా అన్నదానం



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమని మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి అన్నారు. శనివారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.తొలుత కమిటీ సభ్యుడు యాస లక్ష్మారెడ్డి కమిషనర్, ఏసీపీ, సీఐలకు వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు జరిపించి శాలువాలతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండటం అలవర్చుకోవాలన్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమష్టిగా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 9 నవరాత్రులు ఎంత భక్తిశ్రద్ధతో జరుపుకుంటారో, అదేవిధంగా నిమజ్జనాన్ని కూడా అంతే భక్తిశ్రద్ధలతో జరపాలని సూచించారు. అంతేకాకుండా నిమజ్జన ఏర్పాట్లలో అధికారుల నిబంధనలను పాటించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం జరిగేలా నిర్వాహకులు, భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదానానికి భక్తులు స్థానిక వాసులు పెద్ద ఎత్తున హాజరై స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు ముస్కరాజు, తిరుపతిరెడ్డి, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వినాయక మండపంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న మట్టా



**కల్లూరు, సెప్టెంబర్ 19 :** ప్రజా జ్యోతి వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా కల్లూరు పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, మండల అధ్యక్షుడు పోట్రు అర్జునరావు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ ఆలీ, వార్డ్ కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకుల కార్యకర్తలు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పీఆర్టీయుటీఎస్ నూతన ఏకగ్రీవ కార్యవర్గ ఎన్నిక

- పీఆర్టీయూ కూసుమంచి మండల అధ్యక్షుడిగా శీలం ఆంజనేయులు
- ప్రధాన కార్యదర్శిగా ఎం. సతీష్ ఏకగ్రీవ ఎన్నిక




**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి** పీఆర్టీయు టీఎస్ కూసుమంచి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూసుమంచిలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.మండల అధ్యక్షుడిగా శీలం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎం. సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఏ. లక్ష్మీనారాయణ, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా సీహెచ్. కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా బి. పాపారావు, సీహెచ్. మురళీమోహన్, మహిళా ఉపాధ్యక్షురాలిగా పి. విజయరూపిణి ఎన్నికయ్యారు.కార్యదర్శులుగా బి. ఉపేందర్‌రావు, డి. నాగేశ్వరరావు, మహిళా కార్యదర్శులుగా బి. చైతన్య రవళి, కే. వాణి, జె. సునీత, షబానా బేగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమపై విశ్వాసంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న పీఆర్టీయూ కూసుమంచి మండల కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సభ్యులందరినీ సమన్వయం చేసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం, సంఘ ఐక్యతకు ప్రాధాన్యమిస్తూ నిరంతరం పనిచేస్తామని తెలిపారు.కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు, పీఆర్టీయూ మాసపత్రిక ఎడిటోరియల్ సభ్యులు జి. వెంకటరమణ, రాష్ట్ర బాధ్యులు కే. రాజశేఖర్, మల్లికార్జున్, సోమయ్య, అనంత్, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్, సర్వర్ మియా, ఈర్ల కృష్ణతో పాటు పలువురు ఉపాధ్యాయులు, పీఆర్టీయూ సభ్యులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థుల ఆహారంతో ప్రభుత్వం ఆటలాడొద్దు

- నాసిరకం సరుకుల ఆరోపణలపై సిట్ విచారణ జరపాలి: సర్పంచ్ చాపలమడుగు వీరబాబు




**చింతకాని సెప్టెంబర్ 19 ప్రజాజ్యోతి** గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహార సరుకుల సరఫరాపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం, స్వేరోస్ నెట్‌వర్క్, భీమ్ వారియర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.గురుకుల విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని వీరబాబు అన్నారు. ఆహార సరుకుల కొనుగోలు, సరఫరా విషయంలో పారదర్శకత ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ఎలాంటి ముప్పు కలగకుండా నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కోరారు.ప్రస్తుతం గురుకులాల ఆహార సరుకుల కొనుగోలును కేంద్రీకృత విధానంలో నిర్వహించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన తెలిపారు. G.O.Ms.No.17 ద్వారా గురుకులాల్లో ఆహార సరుకుల కొనుగోలు విధానంలో మార్పులు తీసుకొచ్చిన విషయం కోర్టు రికార్డుల్లోనూ నమోదైందని పేర్కొన్నారు. గతంలో జిల్లా స్థాయిలో కొనుగోలు జరిగే విధానానికి భిన్నంగా కొత్త విధానం రావడంతో చిన్నస్థాయి సరఫరాదారులు, స్థానిక కాంట్రాక్టర్లకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు.నేకాఫ్ సంస్థకు సంబంధించిన టెండర్ వ్యవహారంపై పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలని వీరబాబు డిమాండ్ చేశారు. సంస్థ అర్హత, సరఫరా నాణ్యత, ధరలు, టెండర్ ప్రక్రియ, గతంలో ఎదురైన వివాదాలు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. నేకాఫ్ సంస్థను గతంలో బ్లాక్‌లిస్ట్ చేశారన్న ఆరోపణలపై కూడా అధికారిక రికార్డులను బహిర్గతం చేయాలని అన్నారు. ఈ అంశంపై న్యాయస్థానంలో గతంలో వివాదం నమోదైనప్పటికీ, బ్లాక్‌లిస్టింగ్ స్థితిపై భిన్నమైన వాదనలు ఉన్నట్లు కోర్టు రికార్డులు చూపిస్తున్నాయని పేర్కొంటూ, ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.గురుకుల విద్యార్థులకు అందించే పప్పులు, గోధుమపిండి, నూనె, పల్లీలు, చక్కెర, గుడ్లు తదితర ఆహార పదార్థాల నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ ధరలు, టెండర్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటే దానిపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని కోరారు.విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత లోపించిందనే ఫిర్యాదులు వస్తే వెంటనే నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలని, నివేదికలను తల్లిదండ్రులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు.రూ.900 కోట్ల విలువైన గురుకుల ఆహార సరఫరా టెండర్లపై వస్తున్న ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్ ) ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని వీరబాబు డిమాండ్ చేశారు. అవసరమైతే సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. టెండర్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్లు, అర్హతలు, ధరల వివరాలు, సరఫరా ఒప్పందాలు, నాణ్యత పరీక్షల నివేదికలు తదితర సమాచారాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయాలని అన్నారు.గురుకుల విద్యార్థులు పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన పిల్లలని, వారి ఆహారం విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నాణ్యమైన ఆహారం అందించకపోతే తల్లిదండ్రులతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వీరబాబు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో వారియర్, కో-కన్వీనర్ కంకణాల శ్రీనాథ్, సీనియర్ స్వేరోస్ నాయకులు దామెర్ల పృథ్వీరాజ్, బక్క వెంకటేశ్వర్లు, గురుకుల తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారపోగు నాగయ్య, పాలేరు స్వేరోస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జి కొండు రామచంద్రు, మధిర ఇన్‌చార్జి సోలెపోగు శ్యాంసుందర్, ఎస్ఎంఎస్ హాస్టల్స్ జిల్లా నాయకులు సాయి, ప్రేమ్‌కుమార్, బహుజన నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# నో బ్యాగ్ డే లో ఎఫ్ సి ఐ గోడౌన్ ను సందర్శించిన విద్యార్థులు




**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహించిన PTM సమావేశం & NO BAG DAY కార్యక్రమాల్లో భాగంగా జడ్పీహెచ్ఎస్ జలగం నగర్,ఖమ్మం రూరల్ మండలం విద్యార్థులు క్షేత్ర పర్యటన చేసారు. ఖమ్మం నగరంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా FCI గోడౌన్ ను సందర్శించి మిల్లర్లనుండి ధాన్య సేకరణ,ధాన్యాన్ని నిలువ చేసే విధానము, ప్రకృతి విపత్తుల సమయంలో ఆహార ధాన్యాలను నిలువ చేసి ప్రజలకు ఆహార ధాన్యాలను పంపిణీ చేసే విధానం గురించి తెలుసుకున్నారు. ఎఫ్.సి. ఐ స్టాఫ్ సంజయ్ గారు ఇతర సిబ్బంది స్వ యంగా దగ్గర ఉండి విద్యార్థులకు ప్రతి విషయాన్ని చూపిస్తూ వివరించారు. వారు విద్యార్థులకు స్నాక్స్ కూడా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జలగం నగర్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు R.ఆదిలక్ష్మి , T. శంకరయ్య పాల్గొని FCI సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.. ఈ అవకాశాన్ని కల్పించినందుకు పాఠశాల హెచ్ఎం శాంసన్ గారికి విద్యార్థులు-ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేశారు.



# మెడిసిన్ సీటు సాధించిన రోకటి సుష్మకు ఆర్థిక సాయం

- అభినందనలు శెట్టి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన రోకటి రమేష్ – ప్రమీల చిన్న కూతురు రోకటి సుష్మ ఎం బి బి ఎస్ సీటు సాధించిన సందర్భంగా ఖమ్మం రాపర్తి క్యాంప్ ఆఫీస్లో ఘనంగా సన్మానించారు. అనంతరం అభినందనలు తెలుపుతూ ఆర్థిక సహకారం అందించారు.మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, ట్రస్టు బోర్డు చైర్మన్ కనకం జనార్దన్ రావు, కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య, జిల్లా కోశాధికారి మడూరీ పూర్ణ చందర్ రావు, సీనియర్ నాయకులు కాపు జేఏసీ చందు జనార్ధన్, డాక్టర్ గడల శ్రీనివాసరావు, తీగల విజయ్, రాపర్తి శరత్ కుమార్, డాక్టర్ జాబిశెట్టి గౌతమ్, ముత్యం ఉప్పలరావు, సముద్రాల శ్రీనివాసరావు, జిల్లా యూత్ అధ్యక్షులు తోట రమేష్,సూరపనేని బాబురావు,గంగిశెట్టి శ్రీనివాస్, సి హెచ్ విప్లవ కుమార్, పసుపులేటి నాగేశ్వరరావు, బైరిశెట్టి శ్రీనివాసరావు, తాళ్లూరి సోమయ్య, రామిశెట్టి సత్యనారాయణ, వెంపటి నాగేశ్వరరావు నాయుడు ,రాపర్తి అరవింద్, రంగిశెట్టి వరుణ్, కాసం వినయ్, జి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నకాలంలో మంచిగా చదువుకుని మంచి డాక్టర్ గా రాణించాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివించిన తల్లి తండ్రులనూ సన్మానించి అభినందనలు తెలిపారు.

# అర్హులకే ప్రామాణికంగా చేయూత పింఛన్ల పరిశీలన

- కొత్త దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాల సేకరణ
- కుటుంబ పరిస్థితులు, భూమి, ఉద్యోగ వివరాలపై ఆరా
- అనర్హులకు చోటు లేకుండా నిబంధనల పరిశీలన



**తిరుమలాయపాలెం,ప్రజా జ్యోతి సెప్టెంబర్ 19:** కొత్తగా చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించే ప్రక్రియ మండలంలో కొనసాగుతోంది. దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని నిర్ధారించేందుకు అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నారు.తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో పెన్షన్ పరిశీలన అధికారిగా ఉన్న మండల పంచాయతీ అధికారి షేక్ మీరా, పంచాయతీ కార్యదర్శి అంబాల అంజి దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలను సేకరించారు. కుటుంబ సభ్యుల పరిస్థితి, జీవనోపాధి, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా అనే అంశాలతో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన భూమి తదితర వివరాలను పరిశీలించారు.దరఖాస్తులో పేర్కొన్న సమాచారం, క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలనలో వెల్లడైన వివరాలను సరిపోల్చి నమోదు చేశారు. అర్హత ప్రమాణాలను పరిశీలించిన అనంతరం మాత్రమే తదుపరి ప్రక్రియ చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పింఛన్ల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నిజమైన అర్హులకు సంక్షేమ పథకం ప్రయోజనం అందేలా ప్రక్రియ కొనసాగుతోంది.దరఖాస్తుదారులు తమ కుటుంబానికి సంబంధించిన వివరాలను అధికారులకు స్పష్టంగా అందించి క్షేత్రస్థాయి పరిశీలనకు సహకరించాలని అధికారులు సూచించారు. అర్హత నిర్ధారణలో ప్రభుత్వ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడూరు ఉపేందర్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో మహిళ మృతి

- పొలంలో పనిచేస్తుండగా విషాద ఘటన
- జమాయమ్మ మృతితో కుటుంబంలో అలుముకున్న విషాదఛాయలు



**కల్లూరు, సెప్టెంబర్ 19 : ప్రజా జ్యోతి** పొలంలో వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్లిన మహిళ పిడుగుపాటుకు గురై మృతి చెందిన విషాద ఘటన మండలంలో చోటుచేసుకుంది. పొలంలో పనిచేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో నల్లగట్ల జమాయమ్మ(50) అక్కడికక్కడే కుప్పకూలినట్లు సమాచారం.పిడుగుపాటు తీవ్రతకు ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే స్పందించి ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.రోజువారీ వ్యవసాయ పనుల్లో భాగంగా పొలానికి వెళ్లిన జమాయమ్మ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఆమె మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలికి భర్త నల్లగట్ల లాజరు, కుమారుడు నల్లగట్ల ప్రవీణ్, కుమార్తె స్వాతి ఉన్నారు.

## పిడుగుపాటుతో ప్రాణాలు కోల్పోయిన రైతు

- లచ్చన్నగూడెంలో .. దిక్కుతోచని స్థితిలో రైతు కుటుంబం



**వేంసూరు:సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి** వేంసూరు మండలం లచ్చన గూడెం గ్రామంలో విశాదా ఛాయలు అల్లుకున్నాయి పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లిన ఓ రైతు పిడుగు పాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన పర్స ఆనంద రావు (52, తండ్రి: అంజయ్య) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పొలంలో దుక్కి దున్నేందుకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడుతుండగా పొలంలోనే ఉన్న ఆనందరావుపై పిడుగు పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆనందరావు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు పరీక్షించి నిర్ధారించారు.ఆనందరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కూతుళ్లలో ఎవరికీ ఇంకా వివాహం కాలేదు. ఇంటి పెద్ద దిక్కు, కుటుంబాన్ని పోషించే ఏకైక ఆధారం పిడుగుపాటుకు బలికావడంతో ఆ కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. అప్పటివరకు కళ్లముందే ఉన్న వ్యక్తి విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో లచ్చన్నగూడెం గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# క్రీడా మైదానంలో గ్లోబల్ రెయిన్‌బో జైత్రయాత్ర







**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి**
క్రీడా మైదానంలో గ్లోబల్ రెయిన్‌బో జైత్రయాత్ర కొనసాగించింది. చదువుల్లోనే కాదు ఆటల్లో కూడా ముందుంటాం అని సత్తా చాటింది. మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో కబడ్డీ, వాలీబాల్ విభాగంలో బహుమతలు గెలుచుకొని విజయదుందుభి మోగించింది. కూసుమంచి ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు( సెప్టెంబర్ 17 18 )జరిగిన మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ ఎస్.జీ.ఎఫ్ క్రీడా పోటీల్లో కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. కబడ్డీ సీనియర్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం సాధించి తమ ప్రతిభను చాటారు. అలాగే జూనియర్ వాలీబాల్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. సీనియర్ బాలికల వాలీబాల్‌లో ద్వితీయ స్థానం, సీనియర్ బాలుర వాలీబాల్ విభాగంలోనూ ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులకు ఎంఈవో రాయల వీరస్వామి ప్రశంసా పత్రం, మెడల్స్, షీల్డ్‌లు అందజేసి అభినందించారు. శనివారం క్రీడల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ ,జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ రెడ్డి అభినందించారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్, పాఠశాల ఇన్ చార్జులు జహ్నవి, పాపారావు,నాజీయా, పీఈటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలుపై ప్రజల్లో తీవ్ర అయోమయం

- రెండో విడత ఇందిరమ్మ ఇళ్లపై నిరుపేదలకు స్పష్టత లేదు
- రాజీవ్ యువ వికాసం, కూలీల భరోసాపై తేల్చని ప్రభుత్వం
- ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకొని హామీలు అమలు చేయాలి
- లేనిపక్షంలో మండల వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం
- సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



**బోనకల్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో తీవ్రంగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు విమర్శించారు. ప్రభుత్వ విధానాలు, హామీల అమలుపై ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొందన్నారు. మండలంలోని చిరునోముల గ్రామ శాఖ సమావేశం శాఖ కన్వీనర్ గుంపుల జయరాజు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ... సెప్టెంబర్ 15 నుంచి ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు చేస్తామని ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటికీ స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. మొదటి విడత లబ్ధిదారుల ఎంపికలోనే అనేక వ్యత్యాసాలు చోటుచేసుకున్నాయని, రెండో విడతపై కూడా నిరుపేదలకు స్పష్టత లేకుండా పోయిందన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులకే పరిమితమైందని, రుణాల మంజూరుపై స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదన్నారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు అందించాల్సిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలులోనూ జాప్యం జరుగుతోందని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు, పేదల సంక్షేమానికి ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకుని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల నాయకులు ఆకెన పవన్, మాతంగి శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.6,500కు బొజ్జ గణపయ్య లడ్డూ

- 23 ఏళ్లుగా కొనసాగుతున్న కిష్టారం అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీ వినాయకోత్సవాలు
- వైభవంగా గణనాథుని నిమజ్జన వేడుకలు



**సత్తుపల్లి సెప్టెంబర్19(ప్రజా జ్యోతి)**వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కిష్టారం అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీలో గత 23 ఏళ్లుగా ప్రతిష్ఠిస్తున్న బొజ్జ గణపయ్యకు శనివారం ఘనంగా నిమజ్జన వేడుకలు నిర్వహించారు. 5 రోజులపాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడి లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించగా మారోజు శ్రీను, కరుణ దంపతులు రూ.6,500కు లడ్డూను దక్కించుకున్నారు.లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న మారోజు శ్రీను, కరుణ దంపతులు మాట్లాడుతూ.. ఐదు రోజులపాటు మండపంలో భక్తుల పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య లడ్డూను సొంతం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గణనాథుడి ఆశీస్సులు తమ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ లడ్డూ ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించడం తమకు ప్రత్యేకమైన అనుభూతి అని పేర్కొన్నారు.అంగరంగ వైభవంగా ఊరేగింపు తో జరిపించారు.లడ్డూ వేలం అనంతరం బొజ్జ గణపయ్య విగ్రహాన్ని కిష్టారం గ్రామ పురవీధుల్లో భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా ఊరేగించారు. యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని భక్తిగీతాలు, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాల మధ్య గణనాథుడికి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గణపతి వేడుకల నిర్వహణ కమిటీ సభ్యులు కిష్టపాటి కోటిరెడ్డి, కిష్టపాటి రాఘవరెడ్డి, ఉప్పతల సిద్దు, కిష్టపాటి శ్రీనివాసరెడ్డి, వీర నాగేంద్రరెడ్డి, ఈర్ల లోకేష్, ఉప్పతల గోపి, చింతపండు మనోజ్‌తో పాటు అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.